# ఎదురు దెబ్బ

సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికివచ్చి విశ్రాంతిగా కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని, బయట కురుస్తున్న వర్షాన్ని చూస్తున్నాను. వర్షం ఇంట్లో కురవనప్పుడు బాగానే ఉంటుంది చూడ్డానికి!

ఇంతలో ఫోన్ మోగింది. నాబాల్య స్నేహితుడు రామారావు... రెండేళ్ళ క్రితం ఇంట్లోంచి పారిపోయిన వాడి పెద్ద కొడుకు వాసు, ఈ ఊళ్ళో ఇత్తడి దుకాణాల దగ్గర ఎవరితోనో పోట్లాడుతూ కనపడి, తనని చూడగానే దౌడు తీశాడుట. ఏదో కోర్టు పనిమీద వచ్చిన వాడు కాస్తా కొడుకుని తిరిగి పట్టుకోడానికి ఆగిపోయాడట. హొటల్లో దిగి, స్నానం చేసి రాత్రి మా ఇంటికి వస్తానన్నాడు.

"హొటలెందుకు-మా ఇంట్లోనే దిగు" అన్నాను.

"నేనొక్కణ్ణి అయితే అలాగే చేద్దును దేవరాయలు అని నీకు తెలీదులే-అతనూ నాతో వచ్చాడు. కోర్టుల్లో సాక్ష్యాలు ఇస్తూంటాడు. అందాకా మా ఊళ్ళో హైస్కూల్లో క్లర్క్‌గా ఉండేవాడు. కాని కక్ష కొద్ది తీసేసారు-"

"ఎన్నేళ్ళొచ్చినా నీ మొహమాటం అలాగే ఉంది రామం: ఇద్దరూ వచ్చేయండి" అని పట్టు పట్టాను.

రామారావు నసగసాగాడు. "వద్దులే కాని, ఓ విశ్వామిత్రం వచ్చిందోయ్. వర్షం వస్తోంది కదా, ఇప్పుడు! మా దేవరాయలికి సాయంత్రం కాస్త చల్లపడినప్పుడూ శీతాకాలమూ కీళ్ళ నొప్పులు వచ్చేస్తాయి. కదల్లేడు. పాపం నొప్పితో మూలుగుతున్నాడు. ఇదేం వర్షమోయ్! అంటూ. అంచేత కొంచెం డాక్టర్ల బ్రాందీయో, ఏక్టర్ల విస్కీయో గుర్రాల రమ్మో తాగితే తప్ప మనిషి కాడు. ఇక్కడే హొటల్ రూంలో ఆ ఏడుపేదో ఏడిచి, రేపొద్దున్న మీయింటికొచ్చి అట్నించే బస్సు కెళ్తాం-" అన్నాడు-

ఏం బతిమాలించు కుంటావురా బాబూ ఆ మాత్రం తీర్థం నేను పోయలేనా? వెంటనే రిక్షా ఎక్కి మా ఇంటికి వచ్చేయండి ఇద్దరూ" అని ఫోన్ పెట్టేశాను-రామం వాదనకి మరి వీల్లేకుండా.

నేను తలెత్తేసరికి రామసీతా, ముగ్గురు కొడుకులూ, నన్నో సర్కస్ సింహం అన్నట్లు చూస్తున్నారు, ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నారు. వాళ్ళకి నేనెప్పుడో ఏడాదికోసారి సురాపానం చేస్తే చూడ్డం పెద్ద సరదా. ఒక్క పెగ్గు పడితే చాలు నేను వీధి నాటకంలో కృష్ణుడి

వేషం చేసేస్తానని మా ఆవిడ అంటూ వుంటుంది.

"ఫోన్ లో జరగింది అంతా ఫాలో అయ్యావా?" అన్నట్లు రామసీత వేపు చూశాను, కన పడీ కనపడనట్లు తల ఆడించింది. "ఫ్రిజ్ లో ఐస్ ఉందా" అన్నాను. "ఏం స్టయిలు!" అంది.

"అదే, స్టయిలంటే. రామారావు ఒకడే కాదు, శ్రీ శ్రీ దేవరాయలు కూడా వస్తున్నారు వారిని మెప్పించాలి నేను".

"ఎవరయితే నాకేం? మీరూ మీ ఫ్రెండ్సూ ఇంటికప్పెక్కి చెడుగుడు ఆడితే నాకేం? నాలుగు చపాతీలు చేసి పడేస్తాను. మీరూ మీరూ ఏం వేషా లేసుకుంటారో" అంటూ రామసీత వంటింటి వైపు వెళ్ళాక పిల్లలు ముగ్గురూ నా చుట్టూ చేరారు.

మా పెద్దవాడు ఇకిలిస్తూ "రామారావుగారు ఎందుకొచ్చారు నాన్నా? వాసుని మళ్ళీ కొట్టడానికా?" అన్నాడు.

"తప్పురా. పెద్ద కొడుకు మీద తండ్రికి ఉండే ఆశా అభిమానం నీకేం తెలుస్తాయి?"

ముగ్గురు కుర్ర కుంకలూ కూడ బలుక్కున్నట్లు పెద్దగా నవ్వేశారు.

వాళ్ళకి రామం గురించి అంతా తెలుసు. అంచేత వాళ్ళని కోప్పడదామా అని అనుకోబోయి మానేసి నేనూ నవ్వేశాను.

* * *

వాసు మా పెద్దాడి కంటే మూడేళ్ళు పెద్ద. రెండేళ్ళ క్రితం టెన్త్ క్లాస్ పరిక్షలు రాశాడు. ఆ రోజున నేను అక్కడే ఉన్నాను. అంకుల్ అంకుల్ అంటూ వాసు నాదగ్గర ఎంతో ముద్దుగా ఉంటాడు. "పరీక్షలు ఎలా రాశావురా" అన్నాను. నవ్వుతూ "పేపర్లు లీకయ్యాయి కదా, అంకుల్! ఫస్ట్క్లాస్ తప్పదు" అన్నాడు. రామారావు మొహం ముడుచుకున్నాడు. కాని మాట్లాడలేదు. నేను నవ్వేసి "నలుగురితో పాటు నారాయణ అన్నారు. ఇది ప్రజాస్వామ్యం కదా పేపర్లు లీకవడం వల్ల వచ్చే లాభం అందరికీ చెందదు" అన్నాను.

వాసు గడగడా మాట్లాడేస్తున్నాడు "ఈ సోషల్ సిస్టం లాభం లేదు, అంకుల్! డబ్బు కోసం అందరూ గడ్డి తినేస్తున్నారు. ఆ పాపం పోడానికిటు తిరుపతి వెళ్ళి గుండు కొట్టిస్తారు. మా నాన్న నన్నూ తిరపతి తీసికెళ్ళి తల తీయిస్తానని మొక్కుకున్నాట్ట. దేవుడు కేపిటలిస్టా, కేపిటలిస్ట్ ఏజంటా అంకుల్?...." ఇలా వాగుతుంటే కొంత సేపయ్యాకా అంతదాకా కోపం అణుచుకుంటూ కూర్చున్న రామం కూడా మాట కలిపాడు.

"గోపాలం! ఈ వెధవని చూశావు కదా? మనం పిల్లల్ని కంట్రోల్ చెయ్యాలోయ్! బెత్తాన్ని మూలపెడితే కుర్రాడు పాడవుతాడని దొరలు ఊరికే అన్నారా?...." అని ఇంకా ఏదో చెప్పబోతుంటే వాసు పగలబడి నవ్వేశాడు "పిల్లల్ని కొడితే మాట వింటారాః మీరు నన్ను కొట్టని రోజుందా? అందుకే నేను చచ్చినా-"

ఆ తరువాత కొద్ది నిమిషాలూ తల్చుకుంటే నా తల తిరిగి పోతుంది. రామారావు మూలనున్న ఇనుప గొడుగు తెచ్చి దాంతో వాసుని బాదేశాడు. నేను ఆపితే ఆగి, వాణ్ణి మౌనంగా తన గదిలోకి తీసికెళ్ళి, తలుపు గడియపెట్టేసి, మళ్ళీ చితక బాదేశాడు.

వాసుని రిక్షాలో వేసి నేనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను. చాలా కుట్లు పడ్డాయి. ఆ యువడాక్టర్ చాలా బాధపడుతూ "ఇది పోలీసు రాజ్యం కాదని ఎవరనగలరు" అన్నాడు. బస్ రూట్ల గురించి కుర్రాళ్ళు స్ట్రయికు చేస్తున్నారు ఆ బాపతు లాఠీ చార్జీ దెబ్బలు అనుకున్నాడు అతను. నేనేం మాట్లాడ లేదు. నాకు హఠాత్తుగా పొంగి వచ్చిన కన్నీళ్ళని దాచుకోడానికి ముఖం తిప్పేశాను.

ఆ తర్వాత రెండు నెల్లకి కాబోలు వాసు ఇంట్లోంచి పారిపోయాడు. వాణ్ణి వెతుకుతూ ముందు నా దగ్గిరకే వచ్చాడు రామం. దిగులుకంటే కోపమే కనిపించింది అతని ముఖంలో. వాసు మా యింటికి రాలేదు అని తెలిసి నీరు కారిపోయాడు. ఎంత వెతికినా తెలీలేదు వాసు భోగట్టా.

ఇన్నాళ్ళకి వాసు క్షేమంగా ఉన్నాడని రామం ఫోన్ లో చెప్పాకా నా మనసు తేలికపడింది. అందుకేనేమో అంత బలవంతం చేసి అతన్నీ, దేవరాయలునీ మా ఇంటికి రమ్మన్నాను. నిజానికి నాకు రామంతో "మందు" తీసుకోడం ఇష్టం వుండదు. రిలాక్స్ అవడానికి కదా, మద్యపానం చేస్తాం! అక్కడ తన గెజిటెడ్ ఆఫీసర్ పోజు మరీ బిగించేస్తాడు రామం. కాని వాసు సంగతి తెలిసి నాకు కొంచెం ఉషారు వచ్చి ఉంటుంది. అందుకే పిలిచి ఉంటాను వీళ్ళని,

రామసీత వచ్చి నాకుర్చీ పక్కని నేలమీద ఓ దిండు వేసుకుని కూర్చుంది. కొంతసేపు ఇద్దరం మాట్లాడలేదు. అది ఆమె మర్యాద. నేను వాసు గురించి ఎంతగాయపడ్డానో ఆమెకు తెలుసు. నా మనస్సులో ఇప్పుడు వాడే మెదులుతున్నాడనీ తెలుసు "ఏమిటోయ్, ఇంటికి దీపం?" అన్నాను ఆమె తలనిమురుతూ

నా కళ్ళల్లోకి చూస్తూ "రామంగారితో చెప్పకండి" అంది.

"ఏమిటి చెప్పకండీ"

"వాసు ఎడ్రస్సు"

"నీకు తెలుసా?"

"బాబిగాడు ఏడాదినుంచీ వాణ్ణి మీటవుతూనే ఉన్నాడు. వాసు పాపం వాసవీ హోటల్లో కప్పులు కడుగుతూ బతుకుతున్నాడండీ" బావురుమంది రామసీత.

ఆమె తడిసిన బుగ్గల్ని తుడుస్తూ "చెప్పవద్దంటావా? పాపం-రామం కొడుకుకోసం బెంగెట్టుకుని కదా ఇలా వెతుకు తున్నాడు; ఇంక కొట్టడేమోలే కుర్రాణ్ణి" అన్నాను.

"మీకు తెలీదు. వాసు మొన్న మీరు లేనప్పుడు మనింటికొచ్చాడు. భోజనం కూడా చేశాడు. తండ్రి మీద వాడికి క్షమించలేని పగ. హోటల్లో ప్రామోషన్ వచ్చాకా-బుద్ధిగావుంటే వెయిటర్ ఉద్యోగం ఇస్తారుట, నైట్ కాలేజీలో చేరతానన్నాడు, తనిక్కడ ఉన్నట్లు తండ్రికి చెప్పద్దని ఒకటే ఏడుపు. బంతిలా ఉండే కుర్రాడు బల్లిలా అయిపోయాడండీ, తిండిలేక" అని మళ్ళీ ఏడవసాగింది రామసీత.

నేనేదో చెప్పబోతుంటే వీధితలుపు తట్టాడు రామం. రామసీత కళ్ళు తుడుచుకుని, మొహం అంతా అలుక్కుపోయిన కాటుక మీద చిరునవ్వు పులుముకుని తలుపు తీసి "రండి,

ఆయన మీకోసమే చూస్తున్నారు" అని వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది.

నేను కూడా కుర్చీలోంచి లేచి వెళ్ళి అతిథులకు స్వాగతం చెప్పాను. కుశల ప్రశ్నలతో పది నిమిషాలు గడిచాకా అందరం నా గదిలో టేబిల్ చుట్టూ చేరాం. రామసీత అక్కడ ఉంచిన విస్కీసీసా, దానిధర్మపత్నిలా బీర్‌సీసా, వాళ్ళ సంతానంలా సోడా సీసాలు కలకలలాడుతున్న కుటుంబంలా కనిపించాయి. దేశంలో ప్రతీ కుటుంబం నించీ ఏదో రాబట్టాలని ఎదురు చూసే మూడు రాజకీయ పక్షాల్లా మూడు గాజు గ్లాసులు ఆవురావురు మంటూ అక్కడున్నాయి.

దేవరాయలు కుర్చీలో కూచుంటూ బాధతో మొహం చిట్లించి "హమ్మ" అని నిట్టూర్చాడు. నా అడగని ప్రశ్నకి జవాబుగా రామం "చెప్పానుగా, కీళ్ళు పట్టేశాయి. కూర్చుంటే లేవలేడు, లేస్తే కూచోలేడు. పోలీసులు చేసిన పని యిది. అంతలా కొట్టేరన్నమాట ఇతన్ని!" అన్నాడు.

చీర్స్ చెప్పాక దేవరాయలు ఒక గుక్కలో సగం గ్లాసు ఖాళీ చేసేసి చపాతీనములుతూ, అదేనండి సార్! పోలీసు దెబ్బలంటే కన్యా శుల్కంలో గిరీశం అంటాడే-అలాగే. పైకి దెబ్బ కనపడదు; బాధ మాత్రం అమోఘం." అని వివరించాడు. లాఠీలతో ఎలా కొట్టారో సాభినయంగా తెలియజేశాడు.

అప్పుడే రాయలు ... హైస్కూలు క్లర్కు ... అంటే ఆత్రేయగారి "గుమస్తా" ... పేదవాడు కనుక పేకాట "ఒకటి, రెండు మాత్రమే ఆడేవాడుట. కాని ఓ రోజున ఎవరో ఛాలెంజి చేశారు. "అయిదూ, పది" ఆడవల్సి వచ్చింది. ప్రిస్టేజ్ కోసం. నాలుగు వందలు పోయాయి ఒక్క పూటలో. ఇంట్లో డబ్బులేదు. అరువు పెట్టడానికి ఆ గెలిచిన వాళ్ళేమీ చిన్నాచితకా మనుషులు కారాయే!

"పెద్ద మనుషుల్తో వ్యవహారం కదా, సార్! మీ బాకీ రేపిస్తా, ఎల్లుండి యిస్తా అంటే వాళ్ళు జన్మలో మనతో ఆటేస్తారా? నేనూ పరువుకోసం బతికే మనిషిని. వెంటనే ఒక్క గంట గడువు తీసుకుని ఆటనించి లేచాను. స్కూలు తాళం ఎలా తీశానని అడక్కండి. స్కూళ్ళూ, కాలేజీల తాళాలు అంతే. రాజవీధి! బైపు మిషను ఎదురుగ్గా వుంది సైకిల్ మీద మూలపేట తీసికెళ్ళి ఓ పెద్ద మనిషికి అమ్మేశాను. ఏమాట కామాటే చెప్పుకోవాలి. నేను అనుకున్న దానికంటే ఎక్కువే ఇచ్చాడు. మళ్ళీ వెనక్కొచ్చి ఆటలో కూర్చున్నాను. నాలుగు వందలూ కాకుండా మరో రెండు వందలు కూడా పోయాయి. పేకాట అంతేసార్. వచ్చినా అంతే, పోయినా అంతే. లక్ష్మి చంచలం ... హమ్మ!" అని జెబ్బ నిమురుకుంటూ ఉండిపోయాడు. బాధగా మొహం పెట్టి.

మిగతా కథ రామం పూర్తి చేశాడు. "ఆ హెడ్మాస్టర్ గారు కర్కోటకుడు. టైప్ రైటర్‌ని తీసింది ఇతనే అని తెలిసి కూడా పోలీసు రిపోర్టు ఇచ్చాడు. పోలీసులు ఇతన్ని తీసికెళ్ళి చితకపొడి చేశారు. - ఏడాది దాటింది కదూ, దేవరాయులూ?ఆ దెబ్బలకే ఇతనికి ఈ కీళ్ళ బాధ పట్టుకుంది. చూడు పాపం! కూర్చుంటే బాధ, నిలుచుంటే బాధ. విస్కీగ్లాసు చేత్తోపట్టు కున్నా జెబ్బ పట్టేస్తోంది. ఈ పోలీసులు రాక్షసులు. ఇది వాళ్ళ రాజ్యం. ఈ రాజ్యంలో

పేదవాడికి న్యాయం జరగదు గాక జరగదు. ఇక్కడ "నిజం" నెత్తిన గుడ్డేసుకుని పోతోంది. "అబద్ధం" అందలం ఎక్కుతోంది. ఈ దౌర్జన్యం ఎందుకు సహిస్తారు గోపాలం - నువ్వేదో రాడికల్ అను కున్నాను చిన్నప్పుడు."

ఘనసన్మానికి వినయంగా జవాబిస్తున్న మిమిక్రీ ఆర్టిస్టులా దేవరాయలు "మీరు ఒకటేమైన ఇదై పోకండి, రామదా. మీ దిగులు చూసి గోపదా కూడా ఇదై పోతాడు. ఈ సంఘంలో పరువు మర్యాదకి స్థానంలేదు. నేను పైపుమిషను ఎందుకు తీశాను? పేకాటలో గెల్చుకున్న పెద్దమనుషుల్ని చిన్నబుచ్చడం ఇష్టంలేకనే కదా? అది ఒక్కరేనా గుర్తించారా? అందుకు నా కొచ్చిన ఫలితం ఏమిటి? లాఠీ దెబ్బలు. నువ్వు భాదపడ్డు ఘోరాతి! నీది జాలి హృదయం" అని రామం రోజూ చెప్తానే వుంటాడు నాకు. మన తక్షణ కర్తవ్యం వాసుబాబుని ఖనుక్కొని రామం బాబుకి అందించడమే. ఇత్తడికొట్ల దగ్గిర కనిపించాడు కదా. అతనితో పోట్లాడి దెబ్బలు తిన్న కుర్రాడు చెప్పాడు, వాసుబాబు ఈ వూళ్ళోనే ఏదో హోటల్లో ఉద్యోగం చేస్తున్నాడని-"

నాలిక చివరిదాక వచ్చిన మాటని ఆపేసుకున్నాను, గుమ్మం అవతల కీనీడలో నిలుచుని ఒద్దని సైగచేస్తున్న రామసీతని చూసి. వాసు ఇంట్లోంచి పారిపోయింది ఎందుకో నాకు తెలుసు. కళ్ళారా చూశాను కదా-వాడు దెబ్బలుతిని రిక్షాలో నా పక్కని మూలుగుతూ కూర్చుంటే రక్తంతో నా షర్టూ ఫాంటు ఎర్ర పడటం ఆ మరకలు పోగొట్టాలని రామసీత పడిన శ్రమా నాకు తెలుసు. ఆ పాంటూ షర్టూ వాసుకే ఇచ్చేశాడట మా పెద్దవాడు. వాసు వాటిని సైజు చేయించుకుని తొడుక్కుంటున్నాడట.

రామం పోలీసులని చాలా సేపు తిట్టాడు. ఆవేశం కవిత్వం స్థాయిని చేరుకుంది, రామం మనస్సు. దేవరాయలు ఏకాగ్రతతో విస్కీ త్రాగుతున్న మనోహర దృశ్యాన్ని చూస్తూ నేనూ నా గ్లాసు అలాగే ఉంచేశాను.

గంటలో విస్కీ బాటిల్ ఖాళీ అవడం, అగ్గిపుల్ల వెలిగించి దెయ్యాన్ని తరిమేయడం చకచకా జరిగిపోయాయి.

మేం నిద్ర కొరిగేసరికి పదకొండు దాటింది.

మర్నాడు ఆదివారం తొమ్మిదింటికి అందరం స్నానం వగైరాలు పూర్తి చేసి వీధిలో పడ్డాం. "ఈ వెధవని ఎక్కడని వెతకడం. ఇంటికో హోటల్ వున్న ఈ ఊళ్ళో" అని రామం నిరాశ పడ్డాడు.

"నేను పక్కనుండగా మీకేం భయంలేదు సార్. ముందుగా మనం ఎక్కడో గట్టిగా టిఫిన్ చేయాలి, ఉప్మా పెసరట్ ఈ ఊళ్ళో చేసినట్లు ఇండియా మొత్తం మీద ఎవరూ చేయరు. వాసవీహోటల్‌లో ఉప్మా పెసరట్ తిని" అని దేవరాయలు అంటుంటే నేను ఉలిక్కి పడ్డాను, అక్కడ వాసు వాళ్ళ కంటపడతాడేమోననే భయంతో. కాని కప్పులు కడిగేవాళ్ళు ఎక్కడో లోపలుంటారు కాని పెద్ద మనుషులు కూర్చునే చోటుకి రారుగా అని నచ్చ చెప్పు కున్నాను.

వాసవీ హోటల్ లో ఓ టేబిల్ దగ్గర చేరాకగాని నా అజ్ఞానం-లేదా అనుభవ శూన్యత-

నాకు బోధపడలేదు.ఎందుకంటే నేనెప్పుడూ అంతశ్రితం తప్పిపోయిన పిల్లలకోసం వెతకలేదు. నేను మూడు ఉప్మా పెసరట్ ఆర్డరివ్వగానే దేవరాయలు లేచి తిన్నగా హొటల్ కిచెన్ వేపు వెళ్ళిపోయాడు. అక్కడ వాదనకి దిగాడు-హొటల్ వాళ్ళిచ్చిన నీళ్ళ గ్లాసు నిండా జిడ్డు అంటూ లోపలి పనివాళ్లంతా పోగయ్యారు. కౌంటర్ దగ్గిర్నుంచి ప్రొప్రయిటర్ నిదానంగా చూస్తున్నాడు ఈ గొడవని, అందర్నీ బాగా చూసి వాళ్ళతో సద్దుబాటు చేసేసుకుని నవ్వుతూ వచ్చి కూర్చున్నాడు దేవరాయలు. రామం ఆత్రుతగా అతని కళ్ళలోకి చూస్తుంటే గొంతుతగ్గించి "మీ అబ్బాయే అనుకుంటా, ఓ కుర్రాడు అలాగే వున్నాడు ... మీ రెళ్ళకండి. మీరెళ్ళండి గోపాలంగారూ" అని నా మోచేతి మీద పొడిచాడు. విధిలేక అటువేపు వెళ్ళాను. వాసుని ఆ కంపూ, ఎంగిళ్ళ మధ్య చిరుగుల నిక్కరుతో చూసేసరికి-సంతోషంతో, బాధతో, జాలితో, ఆశ్చర్యంతో నా గుండె గిలగిల్లాడి పోయింది, తడబడుతూ వెనక్కి వచ్చి "వాడే!" అన్నాను సన్నగా.

రామం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "గోపాలం, నువ్వెళ్ళి వాడ్ని తీసుకురా. నేనింక వాణ్ణి కొట్టనని చెప్పు. నా బంగారు తండ్రి వాడు. వాడిది మా నాన్న పేరే, అంత గౌరవంగానూ చూసుకుంటాను, ఇవన్నీ వాడికి చెప్పు" అని నా చేతులు రెండూ పట్టుకుని వాపోతున్న రామం గొంతుక బొంగురుపోయింది.

దేవరాయలు స్ట్రాటజీ ప్లాను చేశాడు. "ఉండండి ... తొందర పడకండి గోపాలంగారూ. వాసు దొడ్డి గుమ్మం నించి అటు పారిపోకుండా మనం చూసుకోవాలి. రామంగారూ మీరెళ్ళి వాసుకి కనపడకుండా ఆ కౌంటర్ పక్కన కూర్చోండి. ప్రొప్రెయిటర్‌తో వాసు మీ అబ్బాయి అనీ, తీసుకుపోతున్నారనీ ఎలాగా చెప్పాలిగా...నేను ఈ సందులోంచి వెళ్ళి దొడ్డి గుమ్మం దగ్గర కాస్తాను. అబ్బాయి మీతో వచ్చేశాడా, గొడవే లేదు. కాని ఇంకా తిక్కతిరక్క అటు పరుగెత్తాడా, నేను రెడీగా వుంటాను ...ఆఁ ... ఉప్మారానే వచ్చింది, తినేశాకే మనపని మొదలు పెడదాం" అని వాష్ బేసిన్ దగ్గర కెళ్ళి చేతులు కడుక్కొని వచ్చాడు, నేనూ, రామం టిఫిన్ అసలు ముట్ట లేకపోయాం.

గబగబా టిఫిన్ ముగించి హొటల్ పక్కనున్న సందులోంచి వెనక గుమ్మం వేపు వెళ్ళిపోయాడు దేవరాయలు. మళ్ళీ వర్షం అందుకుంది హఠాత్తుగా. రామం అనుకున్నట్లే వెళ్ళి బిల్ చెల్లించి ప్రొప్రయిటర్ ప్రక్కని కుర్చీలో కూచున్నాడు. నేను హొటల్ కిచెన్ వేపు వెళ్ళాను.

వాసు నన్ను చూసి ఉలిక్కిపడ్డాడు. బెదురుతూనే సంతోషంగా "అంకుల్ ఇలా వచ్చావేం? ఇది చూస్తే నువ్వు హొటల్‌లో మళ్ళీ మంచి నీళ్ళు కూడా తాగవు ..." అన్నాడు.

రెండు వేల రూపాయిల జీతగాడి కొడుకు వాసు. ఇల్లు వదిలాక పట్టిన దరిద్రం వాడి రక్త మాంసాల్ని పీల్చేసింది. కాని మనిషిలో స్వతహాగా ఉన్న తెలివీ, చొరవా ఇంకా పోలేదు. బురద నీటితో నాని కంపు కొడుతున్న చప్టా చూపించి "అదే మా బెడ్‌రూం" అన్నాడు.

"వాసూ, రా, ఇంటికి పోదాం."

"మీ ఇంటికైతే వస్తూనే వున్నాను. మానాన్న ఇంటికేగా నువ్వు రమ్మనేది? డాక్టర్లకి దెబ్బల కేసులు రావటంలేదని వాసుని తీసుకురమ్మని నిన్నుగాని బ్రతిమాలేరేమిటి అంకుల్? నాకిక్కడ హాయిగా వుంది. దెబ్బలాటలు ఉంటాయనుకో. నిన్ననే ఇత్తడి కొట్ల దగ్గర-"

"ఆఁ ఆదే - మీ నాన్న చెప్పాడు."

నా మాటలు వినగానే మెరుపులా వీథివైపు దౌడుతీశాడు వాసు. ప్రాణం కోసం పరుగెట్టడం అంటే ఏమిటో కళ్ళారా చూశాను.

అవతల గుమ్మం దగ్గర పొంచివున్న దేవరాయలు రెండు చేతులు చాపి గుమ్మానికి అడ్డంగా పెట్టాడు. వాసు అతన్ని చూసి బిత్తరపోయి దిక్కులు చూడ్డం మొదలు పెట్టాడు, ఏది దారి అన్నట్లు. మరో క్షణంలో బాధతో విలవిలలాడుతూ పెద్ద మూలుగుతో చాపిన చేతుల్ని క్రిందికి వాల్చేశాడు దేవరాయలు. ఆ ఛాన్స్‌ని వదులుకోకుండా దేవరాయలు పక్కనించి వీథి లోకి దూకేసి లేడిపిల్లలా పరిగెత్తి పోయాడు వాసు.

దేవరాయలు సిగ్గుతో బిక్కమొహం పెట్టి "వర్షం ఇలా మొదలైందో లేదో కీళ్ళ సలుపులు అందుకున్నాయి. పోలీసు దెబ్బలు బాబూ. కీలుకీలునా నాటుకుపోయాయి. ఒక క్షణం ఆటకాయిస్తే ఆగిపోయేవాడు కుర్రాడు. ఖర్మ గురూగారూ"! అన్నాడు.

ఆత్రుతగా వీధి గుమ్మం నించి మా దగ్గరకు వచ్చేస్తున్న రామం ఎదురు దెబ్బ తగిలిన వాడిలా ఆగిపోయాడు.

**(జయశ్రీ; మాసపత్రిక, మార్చి 1980)**

★